సాక్షి
ములుగు

ఆదివారం | 20 | అక్టోబర్ | 2024



క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలని కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి అన్నారు. కేయూ అంతర్ కళాశాలల క్రీడా పోటీలను ప్రారంభించారు. - 8లో▸



కొనసాగుతున్న వరల్డ్ హెరిటేజ్ క్యాంపు

- 8లో▸

రామప్పలో వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ల క్యాంపు ఐదో రోజు కొనసాగింది. చరిత్రకారుడు సత్య నారాయణ రామప్ప టెంపుల్‌పై వివరించారు.

గరిష్టం/కనిష్టం
31.8⁰/24.5⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి సమయంలో పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రైస్ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి కృషి



ములుగు రూరల్: రైస్ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రైస్ మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాధం ప్రవీణ్‌కుమార్ అన్నారు. రాష్ట్ర మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గంప నాగేందర్‌ను శనివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మర్యాద పూర్వకంగా ప్రవీణ్‌కుమార్ కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా మిల్లర్ల సమస్యలను ప్రభుత్వం దృషికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరినట్లు వెల్లడించారు. అనంతరం ప్రవీణ్‌కుమార్‌ను ఆయన శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు పల్లెపాటి సమ్మిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సహోదర్‌రెడ్డి, కోశాధికారి ఎలగందుల మోహన్, కొమురవెల్లి హరినాథ సుదర్శన్‌రెడ్డి, అక్కల రఘోత్తం, భద్రయ్య, లక్ష్మీనారాయణ, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వాజేడు: ఐటీఐలో చేరడానికి విద్యార్థులు దరఖాస్తులను చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ పి.శేఖర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. స్థానిక ఐటీఐలో చేరడానికి ప్రభుత్వం నుంచి 7 విడత అనుమతులు వచ్చినట్లు తెలిపారు. కళాశాలలో అక్టోబర్ ఈ నెల 30వ తేదీ వరకు చేరేందుకు అవకాశం ఉందని వివరించారు. ఇప్పటి వరకు దరఖాస్తులు చేసుకోని వారు వెంటనే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుని మరుసటి రోజు వాక్ ఇన్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు. మొదటి ఆరు విడతల్లో దరఖాస్తులు చేసుకుని సీటు రాని వారు ఉంటే మళ్లీ దరఖాస్తు చేసుకోకుండా నేరుగా కౌన్సెలింగ్‌కు హాజరు కావచ్చని వివరించారు.

'స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను నియమించాలి'

వెంకటాపురం(కె): ఏజెన్సీ కోర్టులో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను నియమించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఉయిక శంకర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఏటూరు నాగారం ఐటీడీఏలో ఏజెన్సీ ఎస్‌డీసీ నిర్వహించక పోవటంతో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌డీసీ నిర్వహించి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. ఏజెన్సీలో గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఉన్నతాధికారులను కోరారు. ఉద్యమాల ద్వారానే ఆదివాసీ హక్కులు, చట్టాలను కాపాడుకోవచ్చని వివరించారు.

నిరుద్యోగులపై లాఠీచార్జ్ చేయడం సరికాదు

ములుగు రూరల్: నిరుద్యోగులపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం లాఠీచార్జ్ చేయడం సరికాదని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి హరీశ్ శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. గ్రూప్-1 విద్యార్థులు తమ న్యాయమైన డిమాండ్లను తీర్చలేక కాంగ్రెస్ ప్రభుత్వం దాడులు చేపడుతుందని ఆరోపించారు. నిరుద్యోగులు తమ హక్కుల కోసం శాంతియుతంగా ఆందోళన చేపడుతుంటే పోలీసులు దాడి చేయడం అమానుషం అన్నారు. గ్రూప్-1 విద్యార్థులకు బీజేవైఎం అండగా ఉంటుందని వివరించారు.

నిరుపేదల సంక్షేమమే బీజేపీ లక్ష్యం



ములుగు రూరల్: దేశంలో నిరుపేదల సంక్షేమమే బీజేపీ లక్ష్యమని పార్టీ జిల్లా అధ్యక్షుడు బలరాం అన్నారు. ఈ మేరకు శనివారం మండల పరిధిలోని అబ్బాపూర్, శ్రీరాములపల్లి, జాకారం గ్రామాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. దేశంలో ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ప్రజలకు సుపరిపాలన అందుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాదం కుమార్, భూక్య జవహర్ లాల్, సిద్ధు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

భూపాలపల్లి అర్బన్: సింగరేణి ఆధ్వర్యంలో ఈ నెల 21న ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఏరియా అధికార ప్రతినిధి మారుతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కృష్ణకాలనీ మినీ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసే వైద్య శిబిరానికి మాతా ఆయుర్వేదిక్ రీసెర్చ్ ఇనిస్ట్యూట్ డాక్టర్ విశ్వనాథ మహర్షి హాజరై పరీక్షించి మందులు అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సింగరేణి ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, పరిసర కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కొలువుల కుటుంబం

ఒక్కో ఇంట్లో ఇద్దరికి మించి ప్రభుత్వ ఉద్యోగులు



- ఉమ్మడి జిల్లాలో కష్టపడి చదివి లక్ష్య సాధన
- ఉన్నతంగా జీవిస్తూ..ఆదర్శంగా నిలుస్తున్న కుటుంబాలు

వాళ్లందరిదీ ఒకే కుటుంబం. తల్లిదండ్రుల కష్టాన్ని దగ్గరి నుంచి చూశారు. భవిష్యత్ ఏమిటన్నదానిపై ఒక నిర్ణయానికి వచ్చారు. కసితో చదివారు. సర్కారు కొలువు అనే లక్ష్యాన్ని సాధించారు. ప్రజా సేవ చేసేందుకు ప్రభుత్వ కొలువుల్లో చేరిన ఒకే కుటుంబ సభ్యులపై 'సాక్షి' సండే స్పెషల్ స్టోరీ.

సండే స్పెషల్

రైతుబిడ్డలు.. సర్కారీ కొలువులు



ఉద్యోగాలు సాధించిన పిల్లలతో తల్లిదండ్రులు

చెన్నారావుపేట: వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేట గ్రామానికి చెందిన పేద రైతు బానోతు కోబల్-కమలమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. తల్లిదండ్రుల శ్రమను దగ్గరి నుంచి చూసిన పిల్లలు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. పెద్ద కుమారుడు రవి హుజూరాబాద్‌లో హెల్త్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. రెండో కుమారుడు వెంకన్న చెన్నారావుపేట మండలం అమృతండా పాఠశాలలో పనిచేస్తున్నారు. కూతురు రమాదేవి రాయపర్తి మండలం కేశవాపూర్ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్నారు.

తల్లిదండ్రులే కాదు.. కొడుకులు, కూతుళ్లు కూడా..



కుమారులు, కూతుళ్లతో వాలియా దంపతులు

హసన్‌పర్తి: మొక్కలను కన్న బిడ్డల్లా చూసుకున్నారు. వృత్తిలో భాగంగా రోజూ నీళ్ల పట్టారు. ఇప్పుడవి నీడనిస్తున్నాయి. అదే మాదిరిగా చిన్నప్పటి నుంచే ప్రోత్సాహాన్నందిస్తూ.. కొడుకులు, కూతుళ్లకు ప్రేరణ అందించారు. వారిని సైతం ప్రభుత్వ కొలువులు సాధించేలా చేశారు. ధర్మసాగర్ మండలం పీసరకు చెందిన బానోతు వాలియా- శాంతమ్మ దంపతులు ఉద్యోగ రీత్యా ఎస్సారెస్పీ క్యాంప్ క్వార్టర్స్‌లో ఉంటూ తోటమాలిగా పని చేశారు. వీరికి ముగ్గురు కుమారులు రాజు, రంగన్న, రాజేశ్, ముగ్గురు కూతుళ్లు పార్వతి, అరుణ, అపర్ణ వీరంతా ప్రభుత్వ పాఠశాలలోనే విద్యను అభ్యసించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో వీరంతా ప్రభుత్వ ఉద్యోగాలు (రాజేశ్ మినహా) సాధించారు. రాజు కొత్తగూడెం భద్రాచలంలో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తుండగా.. రంగయ్య (జైళ్ల శాఖ)లో పనిచేస్తున్నారు. రాజేశ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ (యూఎస్)లో విధులు నిర్వహిస్తున్నాడు. పార్వతి కరీంనగర్ కమిషనరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు, అరుణ పరకాలలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, అపర్ణ ఆదిలాబాద్‌లో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పెద్ద అల్లుడు పోరిక ఓంకార్ సింగ్ నీటిపారుదల శాఖలో పనిచేస్తుండగా.. రెండో అల్లుడు గణేశ్ కూడా టీచరే.

ముగ్గురు విద్యాశాఖ.. ఒకరు పీఆర్

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలం కంబాలపల్లికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎండీ.యాకుబ్ అలీ, ఫాతిమా బీ దంపతులకు నలుగురు కుమారులు. యాకుబ్ గుండెపోటుతో 1990లో మృతిచెందారు. ఆయన పెద్ద కుమారుడు షాహీద్ అలీ స్కూల్ అసిస్టెంట్‌గా గూడూరు మండలం అయోధ్యపురం జెడ్పీ హైస్కూల్లో పని చేస్తున్నారు. రెండో కుమారుడు గౌస్ ప్రస్తుతం కురవి మండల పంచాయతీ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. మూడో కుమారుడు మహమూద్ అలీ గార్ల మండలం ముల్కనూరు జెడ్పీ హై స్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. నాలుగో కుమారుడు గులాం రసూల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు.



తల్లి ఫాతిమా బీ పుట్టిన రోజు నిర్వహిస్తున్న కుమారులు

ఐదుగురూ టీచర్లే..

కమలాపూర్: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరుకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు అంకతి జనార్దన్ కుటుంబంలో ఐదుగురు టీచర్లే ఉన్నారు. జనార్దన్ స్ఫూర్తితో ఆయన పెద్ద కుమారుడు లక్ష్మణ్, చిన్న కుమారుడు కృష్ణ, కూతురు శైలజ ఉపాధ్యాయ వృత్తి ఎంచుకున్నారు. ఇద్దరు కోడళ్లు ప్రభావతి, జ్యోతి కూడా ప్రభుత్వ ఉపాధ్యాయులే కావడం విశేషం. లక్ష్మణ్ ప్రస్తుతం సిద్దిపేట జిల్లా అక్కన్నపేట జెడ్పీహెచ్ఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభావతి కమలాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పని చేస్తున్నారు. కృష్ణ సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం మంచినీళ్లబండ ఎంపీపీఎస్‌లో ఎస్జీటీగా పని చేస్తున్నారు. జ్యోతి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గంగారం జెడ్పీహెచ్ఎస్‌లో పాఠాలు బోధిస్తున్నారు. శైలజ కరీంనగర్ జిల్లా జమ్మికుంట ఉన్నత పాఠశాలలో చదువు చెబుతున్నారు. విద్యను పంచుతున్న ఈ కుటుంబాన్ని స్థానికులు అభినందిస్తున్నారు.



జనార్దన్‌తో కుమారులు, కోడళ్లు, కూతురు

అన్నా, చెల్లి టీచర్లు.. తమ్ముడు సీఐ

నెల్లికుదురు: ఏదైనా సాధించాలనే కసితో అహర్నిశలు చదివి ప్రభుత్వ ఉద్యోగస్తులుగా స్థిరపడ్డారు ఇనుగుర్తి మండలం చిన్ననాగారం గ్రామానికి చెందిన బొమ్మెర యాకలక్ష్మి-లచ్చయ్యగౌడ్ సంతానం. లచ్చయ్య కల్లుగీత కార్మికుడిగా వృత్తి నిర్వహిస్తూ కూలి పనులకు వెళ్తూ కూతురు స్వప్న, కుమారులు కేదార్, బాలకృష్ణను చదివించారు. ఆముగ్గురు తండ్రి కష్టాన్ని వృథాగా పోనివ్వలేదు. పోటీపడి చదివి కేదార్, స్వప్న 2008 డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్లుగా ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. ప్రస్తుతం మరిపెడ జెడ్పీహెచ్ఎస్‌లో విధులు నిర్వహిస్తున్నారు. బాలకృష్ణ పోలీస్ శాఖలో 2014లో ఎస్సై ఉద్యోగానికి ఎంపికై ప్రస్తుతం ఖమ్మంలో సీఐగా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వ కొలువులు సాధించిన ఒకే కుటుంబానికి చెందిన ఈ ముగ్గురు గ్రామానికే వన్నె తెస్తున్నారు.



నెల్లికుదురు చిన్ననాగారంలో ప్రభుత్వ ఉద్యోగులు అన్న, చెల్లి, తమ్ముడు

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూర్యచంద్రకళ

మంగపేట: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు లక్ష్యంతో చదివాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్‌వీపీ సూర్యచంద్రకళ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సూర్యచంద్రకళ హాజరై మాట్లాడారు. జాతీయ, రాష్ట్ర సూచనల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. చట్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. చట్టం ముందు అందరూ సమానులేనని బాల్య వివాహాలు నేరమన్నారు. దేశ భవిష్యత్ అంతా పాఠశాల స్థాయి నుంచే ప్రారంభం అవుతుందని తెలిపారు. నేటి బాలలే రేపటి పౌరులన్నారు. ప్రతీ విద్యార్థి లక్ష్యంతో చదివినప్పుడే ఉన్నత స్థాయికి ఎదుగుతారని సూచించారు. అనంతరం మోటారు వెహికిల్ యాక్టు, ఉచిత న్యాయ చట్టం, పోక్సో చట్టం వంటి తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి. కన్నయ్యలాల్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి డి.రామమోహన్‌రెడ్డి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సౌఖ్య, ఏటూరు నాగారం సీఐ అనుముల శ్రీనివాస్, స్థానిక ఎస్సై సూరి, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పొదెం మేనక, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జడ్జి సూర్యచంద్రకళ

షెడ్ల నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి

- కలెక్టర్ టీఎస్.దివాకర

ములుగు రూరల్: ములుగు మండల పరిధిలోని మల్లంపల్లి, జంగాలపల్లి మార్కెట్‌లో నిర్మిస్తున్న అదనపు షెడ్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్.దివాకర సూచించారు. ఈ మేరకు శనివారం మల్లంపల్లి, జంగాలపల్లిలో నిర్మిస్తున్న షెడ్ పనులను పరిశీలించి మాట్లాడారు. చిరు వ్యాపారులు రోడ్లకు ఇరుపక్కల వ్యాపారాలు చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుండడంతో షెడ్ల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలన్నారు. సంబంధిత అధికారులు పనులను నిత్యం పర్యవేక్షించి ఎంబీ రికార్డుల మేరకు బిల్లు చెల్లించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) ఇన్‌చార్జ్ సంపత్‌రావు, ఏపీఓ రాజు, జేఈ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ సతీష్, పంచాయతీ కార్యదర్శి పోలురాజు తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర

ఆలిండియా మైన్స్ రెస్క్యూ పోటీలకు ఎంపిక

భూపాలపల్లి అర్బన్: ఆలిండియా మైన్స్ రెస్క్యూ పోటీలకు భూపాలపల్లి రెస్క్యూ సిబ్బంది ఎంపికైనట్లు ఏరియా అధికార ప్రతినిధి మారుతి తెలిపారు. ఈనెల 16, 17 తేదీల్లో గోదావరిఖనిలో జరిగిన జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీలలో ఏరియాకు చెందిన పూర్ణచందర్, భాను ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీకాంత్, మురళి పాల్గొన్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచి డిసెంబర్ నెలలో ధన్‌బాద్‌లో జరిగే ఆలిండియా పోటీలకు ఎంపికయ్యారు. శనివారం ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయంలో జీఎం హబీబ్ హుస్సేన్, రెస్క్యూ ఇన్‌చార్జ్ రవీందర్ వారిని అభినందించారు.



రెస్క్యూ సిబ్బందిని అభినందిస్తున్న జీఎం

పర్యావరణ రక్షణ బాధ్యత

భూపాలపల్లి అర్బన్: పర్యావరణ రక్షణ బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఏజీసీ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్ కోరారు. ఎన్‌జీసీ, విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లాకేంద్రంలోని కేజీబీవీలో నిర్వహించిన వేస్ట్ టు వెల్త్ ఎగ్జిబీషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని 60 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ఎగ్జిబీషన్‌లో పనికిరాని వస్తువులతో 200 మోడల్స్, ఎగ్జిబిట్‌లను ప్రదర్శించారు. ఈ ఎగ్జిబిట్లను రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్ సందర్శించి మాట్లాడారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ విద్యార్థిపైన ఉందన్నారు. పర్యావరణ హితంగా నడుచుకోవాలని సూచించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన కొంపల్లి పాఠశాల, కేటీపీపీ డీఏవీ, మహదేవపూర్ గుడ్‌మార్నింగ్ పాఠశాలల విద్యార్థులు విజేతలుగా నిలిచారు.

కేసులు సత్వరమే పరిష్కరించాలి

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

ములుగు: ఎస్సీ, ఎస్టీకి సంబంధించిన భూ సమస్యలు, అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. జిల్లా కేంద్రానికి ఆయన శనివారం చేరుకోగా కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్‌లు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ దివాకర అధ్యక్షతన ఎస్పీ శబరీశ్, కమిషన్ సభ్యులు నీలాదేవి, రాంబాబు నాయక్, ప్రవీణ్‌లతో కలిసి ల్యాండ్, సర్వీస్, అట్రాసిటీ కేసులు వివిధ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో వివిధ శాఖల ద్వారా ఎస్సీ, ఎస్టీలకు అందుతున్న అభివృద్ధి ఫలాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి మంజూరైన నిధుల వినియోగం వివరాలను శాఖల వారీగా అధికారులు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసులు త్వరితగతిన పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. అన్ని రకాల పెండింగ్ కేసులు 15రోజుల్లో పరిష్కరించాలని సూచించారు. ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలు ఇతర అణగారిన వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే ఉపేక్షించబోమని అన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఎస్పీలకు సూచించారు. పోలీస్ స్టేషన్‌లో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం పక్కాగా అమలు జరిగేలా చూడాలని, ఎస్సీ, ఎస్టీలను వేధింపులకు గురి చేసే అధికారులపై కమిషన్ కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఎక్కడైన ఎస్సీ, ఎస్టీలకు సమస్యలు ఎదురైతే కమిషన్ అక్కడికి వెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తుందని తెలిపారు. ప్రతినెలా చివరి వారంలో సివిల్ రైట్స్ డే, ప్రతీ మూడు నెలలకు ఒక్కసారి తప్పని సరిగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్, ఎస్పీలు చక్కగా పనిచేస్తున్నారని అభినందించారు. అనంతరం కలెక్టర్ దివాకర మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వివిధ శాఖల ద్వారా సంక్షేమ పథకాలు అందేలా జిల్లా యంత్రాంగం తరఫున కృషి చేస్తున్నట్లు తెలిపారు. అందుకోసం సివిల్ రైట్స్ డేనే నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంపొందించేచే చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయా సమస్యలపై బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సమావేశంలో డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్లు మహేందర్, సంపత్ రావు, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, ఎస్సీ, బీసీ సంక్షేమ అధికారి లక్ష్మణ్ నాయక్, రవీందర్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, జిల్లా అధికారులు, తహసీల్దార్లు ఎంపీడీఓలు, మానిటరింగ్ కమిటీ సభ్యులు, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న వెంకటయ్య, కమిషన్ సభ్యులు



మాట్లాడుతున్న వెంకటయ్య

క్రెచ్ సెంటర్ల విధి విధానాలు విడుదల చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న జయలక్ష్మి

ములుగు రూరల్: ప్రభుత్వం క్రెచ్ సెంటర్ల విధి విధానాలను వెంటనే విడుదల చేయాలని అంగన్‌వాడీ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి కలెక్టర్ దివాకర కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రెచ్ సెంటర్ల ప్రారంభాలను నిలిపి వేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో మూడేళ్ల చిన్నారులకు విద్యాబోధనకు ప్రభుత్వం ప్రకటనలు చేస్తూ క్రెచ్ సెంటర్లు ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం నిర్ణయాలు తీసుకునే క్రమంలో విధి విధానాలు, జీఓలను విడుదల చేయాలని కోరారు. అంగన్‌వాడీలు చేపట్టిన ధర్నాకు సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో అంగన్‌వాడీలలో గందరగోళం నెలకొంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రత్నం రాజేందర్, గపూర్, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సరోజన, సమ్మక్క, రమాదేవి, ధనలక్ష్మి, సూరమ్మ, రాంబాయి, సరిత, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై వినతుల స్వీకరణ

మంగపేట: మండల కేంద్రంలోని 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో టీజీఎన్‌పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ వేణుగోపాల చారి ఆధ్వర్యంలో శనివారం వినియోగదారుల లోకల్ కోర్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏటూనాగారం సబ్‌డివిజన్ పరిధిలోని మంగపేట, ఏటూరునాగారం, కన్నాయిగూడెం మండలాల పరిధిలోని వివిధ రకాల విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు వినియోదారుల నుంచి అధికారులు శనివారం వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల నుంచి వచ్చిన వినియోదారులు విద్యుత్ సమస్యలపై అధికారులకు వివరించారు. అనంతరం విద్యుత్ బిల్లులకు సంబంధించినవి 3, అధిక లోడు గురించి 2, లూజ్ లైన్లు సరిచేయాలని 3, కేబుల్ చెడిపోయిన సమస్యపై 4 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఇలా మొత్తంగా 12 ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు. అనంతరం వినియోదారుల ఫోరం చైర్మన్ వేణుగోపాల చారి మాట్లాడుతూ వినియోదారులు ఇచ్చిన ఫిర్యాదులతో పాటు పలువురు చెబుతున్న సమస్యలను పరిగణలోకి తీసుకొస్తే పూర్తి స్థాయిలో విచారించి పరిష్కరిస్తామని వివరించారు.ఈ కార్యక్రమంలో టీజీ ఎన్‌పీడీసీఎల్ విద్యుత్ వినియోదారుల ఫోరం సభ్యులు రమేష్(టెక్నికల్), చరణరాజ్, సభ్యులు(ఫైనాన్స్) డివిజినల్ ఇంజనీర్ పులసం నాగేశ్వర్‌రావు, సబ్‌డివిజన్ ఇంజనీర్ సుధాకర్, ఏటూరునాగారం ఏఈ అశోక్, కన్నాయిగూడెం ఏఈ స్వామి, సబ్ ఇంజనీర్లు, మంగపేట మండల విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుత్ సమస్యలను అధికారులకు వివరిస్తున్న అకినేపల్లిమల్లారం మాజీ సర్పంచ్ శ్రీధర్‌వర్మ

బిల్ట్ కార్మికుల నిరసన

మంగపేట: తమకు అన్యాయం జరిగిందంటూ అటు బిల్ట్ ఇటు జేఏసీ నాయకులకు విన్నవించినా నోరు మెదపక పోవడంలో వెనుక ఆంతర్యం ఏమిటని బిల్ట్ కార్మికులు నిరసనకు దిగారు. మండల పరిధిలోని కమలాపురం ప్రధాన సెంటర్‌లో శనివారం అంబేద్కర్ విగ్రహం వద్ద కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తినడానికి తిండిలేక ఫ్యాక్టరీనే నమ్ముకుని జీవిస్తున్నామన్నారు. బిల్ట్ యజమాన్యం ఫిన్‌క్వెస్ట్ సంస్థతో కొందరు జేఏసీ నాయకులు కుమ్మక్కై కార్మికులకు రావాల్సి వేతన బకాయి, గ్రాడ్యువిటీ డబ్బులను పూర్తిగా చెల్లించలేదన్నారు. 12 మంది జేఏసీ నాయకులు, ఫిన్‌క్వెస్ట సంస్థ, బిల్ట్ యజమాన్యం కార్మికుల ముందుకు వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రెడ్డి, వెంకటరాజిరెడ్డి పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు

క్లుప్తంగా

విద్యాకమిషన్ అడ్వయిజరీ కమిటీలో కేయూ ఆచార్యులు

కేయూ క్యాంపస్: తెలంగాణ విద్యాకమిషన్ అడ్వయిజరీ కమిటీ సభ్యులుగా కాకతీయ యూనివర్సిటీకి చెందిన ఇద్దరు రిటైర్డ్ ప్రొఫెసర్లకు అవకాశం లభించింది. ఈమేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేశం ఉత్తర్వులు జారీచేశారు. తెలంగాణ విద్యాకమిషన్ చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళితోపాటు మరో ముగ్గురు సభ్యులను ఇప్పటికే ప్రభుత్వం నియమించిన విషయం విధితమే. అయితే ఈవిద్యాకమిషన్‌కు అడ్వయిజరీ కమిటీ సభ్యులుగా ఆరుగురిని నియమించగా అందులో కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం రిటైర్డ్ ఆచార్యులు మురళీమనోహర్, ఎకానిమిక్స్ విభాగం రిటైర్డ్ ఆచార్యులు వెంకటనారాయణను నియమించారు. మురళీమనోహర్ బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్‌గాను వ్యవహరిస్తున్నారు. ఆచార్య వెంకటనారాయణ సామాజిక ఉద్యమకారులు, తెలంగాణ ఉద్యమకారుల చైర్మన్‌గా కొనసాగుతూ.. సామాజిక సమస్యలపై పోరాడుతున్నారు. విద్యావేత్తలుగా విద్యారంగంలో వస్తున్న మార్పులపై విద్యారంగాభివృద్ధికి విద్యాకమిషన్‌కు పలు సూచనలు సలహాలు చేసే అవకాశం వీరికి ఉంటుంది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ఆచార్యులు ప్రముఖ సామాజికవేత్త ప్రొఫెసర్ హరగోపాల్, శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సుజాత, ఎంవీఎఫ్ నేషనల్ కన్వీనర్ వెంకటరెడ్డి, ఎడ్యూకేషన్ స్పెషలిస్టు యూనిసెఫ్ కేఎం శేషగిరిరావుకు సైతం ఈకమిటీలో స్థానం లభించింది.

రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- పెన్షనర్స్‌కు పే కమిషన్ ప్రకటించాలి
- ఏఐఆర్‌ఆర్‌ఎఫ్ ప్రెసిడెంట్ శ్రీధర్

కాజీపేట రూరల్ : రైల్వే రిటైర్డ్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 8వ పే కమిషన్‌ను వెంటనే ప్రకటించి, దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే ఫెడరేషన్ ఢిల్లీ ప్రెసిడెంట్ ఎస్.శ్రీధర్ డిమాండ్ చేశారు. రిటైర్డ్ పెన్షనర్స్ సమస్యలపై ప్రధాని మోదీ, రైల్వే మంత్రి, రైల్వే బోర్డు అధికారులను కలిసి శనివారం ప్రెసిడెంట్ శ్రీధర్, ఫెడరేషన్ ట్రెజరర్ ఎస్.ఆర్.సీ.రాజు, జోనల్ ట్రెజరర్ స్వామిలు తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో కాజీపేట జంక్షన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా కాజీపేట రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కందుల సంగమయ్య, సికింద్రాబాద్ జోనల్ అసిస్టెంట్ సెక్రటరి సీహెచ్ కొమ్మాలు స్వాగతం పలికారు. ప్రెసిడెంట్ శ్రీధర్ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పలు డిమాండ్లపై నవంబర్ 13వ తేదీన ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద మహా ధర్నా చేపడుతున్నట్లు చెప్పారు. అలాగే నవంబర్ 28వ తేదీన మహారాష్ట్ర అహ్మద్‌నగర్‌లో 59వ వార్షిక సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పెన్షనర్స్ మెడికల్ సమస్యలను పరిష్కరించాలని ప్రధాని, బోర్డు అధికారులకు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.



క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

- కేయూ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి
- కేయూ అంతర్‌కళాశాలల క్రీడాపోటీలు ప్రారంభం


సమావేశంలో మాట్లాడుతున్న కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, పక్కన ప్రిన్సిపాల్ జ్యోతి తదితరులు

కేయూ క్యాంపస్: విద్యార్థులు చదువుతోపాటుగా క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి అన్నారు. కాకతీయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల క్రీడా పోటీలను హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్వహించిన సమావేశంలో మల్లారెడ్డి మాట్లాడారు. క్రీడలు శారీర దారుఢ్యానికి మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. క్రీడాపోటీల్లో గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ఆచార్య వెంకయ్య మాట్లాడుతూ.. క్రీడాస్ఫూర్తితో.. గెలుపే లక్ష్యంగా ఆడాలని సూచించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జ్యోతి మాట్లాడుతూ.. మారుతున్న కాలంలో క్రీడలపై నిర్లక్ష్యం పెరిగిందని అభిప్రాయపడ్డారు. విద్యతోపాటు క్రీడలను కూడా సమానంగా ఆదరించడం ద్వారా ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. నేటి ఆధునిక సమాజంలో సెల్‌ఫోన్‌లోనే గేమ్స్ ఆడుతున్నారని ఇది విద్యార్థుల శారీరక మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందనేది గమనించాలన్నారు.


సాఫ్ట్‌బాల్ ఆడుతున్న కేయూ వర్సెస్ ఆర్ట్స్ కాలేజ్


ఖోఖో ఆటలో హోరాహోరీ పోరు

కార్యక్రమంలో ఆ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ భాస్కర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేశ్, ఖోఖో క్రీడాకారుడు రాజేందర్, డాక్టర్ నెహదా, డాక్టర్ శ్రీలత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. తొలిరోజు కేయూ అంతర్ కళాశాలల క్రీడాపోటీల్లో ఖోఖో, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, సాఫ్ట్ బాల్ పోటీలను నిర్వహించారు. తొలుత కేయూ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జట్ల మధ్య కబడ్డీ పోటీలు జరిగాయి. ఈ పోటీలను కేయూ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి ప్రారంభించారు. అంతకుముందు క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించారు. వివిధ క్రీడాపోటీలు ఈనెల 21వరకు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా ఫుట్‌బాల్, రగ్బీ జట్ల ఎంపిక


క్రీడాకారులతో నిర్వాహకులు

డోర్నకల్: డోర్నకల్ బిషప్ కాంపౌండ్ గ్రౌండ్‌లో శనివారం ఉమ్మడి వరంగల్ జిల్లా ఫుట్‌బాల్, రగ్బీ జట్ల ఎంపికలు జరిగాయి. త్వరలో జరగబోయే ఎస్‌జీఎఫ్ అండర్–14, 17 బాలుర, బాలికల రగ్బీ, అండర్–14 బాలబాలికల ఫుట్‌బాల్ పోటీల కోసం డోర్నకల్‌లో ఉమ్మడి జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి సుమారు 350 మంది క్రీడాకారులు క్రీడా ఎంపికకు హాజరయ్యారు. ఇక్కడ ఎంపికయ్యే జట్లు ఉమ్మడి జిల్లా నుంచి త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిథ్యం వహించనున్నాయి. క్రీడా ఎంపికలను జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం బండి నర్సింహరావు ప్రారంభించారు. ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లా ప్రతినిధులు సత్యనారాయణ, ఓలేటి జ్యోతి, నరేందర్‌గౌడ్, పేటా ప్రతినిధులు కొమ్ము రాజేందర్, విజయచందర్, రవి, సునీల్, గోవర్ధన్, ప్రసాద్, మోజెస్ మనోహర్, అప్పిరెడ్డి, జె.కమల, అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

- ఎమ్మెల్సీ అలుగు బెల్లి నర్సిరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

ఖిలా వరంగల్/కాశీబుగ్గ సెంటర్: వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఉపాధ్యాయ ఓటరుగా నమోదు చేసుకుని, మరోసారి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. ఈమేరకు శనివారం వరంగల్ శంభునిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం వరంగల్ రంగశాయిపేటతోపాటు పలు కళాశాలలు, పాఠశాలలను సందర్శించారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు నవంబర్ 6వ తేదీలోపు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అధ్యాపకురాలు మైదం రూపారాణి, టీఎస్‌యూటీఎఫ్ వరంగల్ అధ్యక్షుడు తాటికాయల కుమార్, ప్రధాన కార్యదర్శి సుజన్ ప్రసాదరావు, రఫూఫ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కష్టపడితేనే సమాజంలో గుర్తింపు


దీప్తిని సన్మానిస్తున్న అక్షర పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్సై

దంతాలపల్లి: కష్టపడితేనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని, దీప్తి జీవాంజి చిన్నతనంలో ఎదురైన అవహేళనలను ఎదిరించి ప్రపంచ స్థాయిలో విజయకేతనం ఎగురవేసి గుర్తింపు పొందిందని అక్షర పాఠశాల ప్రిన్సిపాల్ యాకేశ్ అన్నారు. ఇటీవల పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన దీప్తిని శనివారం పాఠశాలలో సత్కరించారు. ఈ సందర్భంగా యాకేశ్ మాట్లాడుతూ.. గతంలో తమ శిష్యురాలైన దీప్తి ప్రపంచ విజేతగా ఎదగడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థులు పేదరికం, అంగవైకల్యం అనే ఆలోచన చేయకుండా దీప్తిని ఆదర్శంగా తీసుకుని లక్ష్యంపై దృష్టిసారించాలని సూచించారు. అనంతరం దీప్తి మాట్లాడుతూ.. రన్నింగ్ చేయాలంటే కుటుంబ పేదరికం వల్ల షూ కొనలేని పరిస్థితి తన చిన్నతనంలో ఉండేదని గుర్తు చేసుకున్నారు. ఖమ్మం నగరంలో జరిగిన పోటీలో పతకం సాధించడం.. ఆర్డీఎఫ్ పాఠశాల రామ్మోహన్‌రావు తన పట్టుదలను గుర్తించడంతోపాటు, నాగపురి రమేశ్ సార్ సహకారంతో ఈస్థాయికి చేరానని తెలిపారు. విద్యార్థులు అధైర్య పడకుండా సాగినప్పుడే జీవిత లక్ష్యాలను చేరుకుంటారని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీదేవి, చిన్ననాటి గురువు ఎన్నమనేని దేవేందర్, ఎస్సై రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు
- రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం


సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వరంగల్: తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తోందని, ఉద్యోగాల్లో 20శాతం క్రీడాకారులకు రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. నగరంలోని 14వ డివిజన్ రెడ్డిపురంలోని ఇన్‌ఫాంట్ జీసస్ పాఠశాలలో శనివారం 9వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ 2024–25ను కలెక్టర్ సత్యశారదతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం క్రీడాభివృద్ధికి నిధులు కేటాయింపుతోపాటు ప్రతీ జిల్లాలో స్పోర్ట్స్ హాస్టళ్లను ఏర్పాటు చేసిందన్నారు. ఇంటర్ డిస్ట్రిక్ట్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌ను వరంగల్‌లో నిర్వహిస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు వీరగోని రాజ్‌కుమార్, కార్యదర్శి పూజారి అశోక్‌బాబులను ఆయన అభినందించారు. కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. విద్యతోపాటు క్రీడలు సామాజిక అభివృద్ధి, దేహధారుడ్యం, మానసిక వికాసానికి తోడ్పడతాయన్నారు. క్రీడలు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయన్నారు. రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అబ్జర్వర్ ఎండీ.అజీజ్‌ఖాన్, ఇన్‌ఫాంట్ జీసస్ హెచ్‌ఎం మరియమ్మ మథూర్, టి.రాజేందర్, డీవైఎస్‌ఓ సత్యవాణి, కైలాష్‌యాదవ్, హాసిని చిట్‌ఫండ్ ఎండీ లింగం కిరణ్, కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య, జన్ను అనిల్, వెంకటేశ్వర్లు, రఘువీర్, యాదగిరి, ఇంతియాజ్, స్వప్న పాల్గొన్నారు.

రామప్పలో కొనసాగుతున్న వరల్డ్ హెరిటేజ్ క్యాంపు


వలంటీర్లు, చరిత్రకారులతో సైంటిస్టు అండ్రీ

వెంకటాపురం(ఎం): మండలంలోని రామప్పలో వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ల క్యాంపు శనివారం ఐదో రోజు కొనసాగింది. శనివారం ఉదయం యోగా ఇన్‌స్ట్రక్టర్ రాంబాబు వలంటీర్లకు యోగాసానాలు నేర్పించారు. ఉదయం 10గంటలకు ఐకోమాస్ ఇండియా ప్రొఫెసర్ జీఎస్‌వీ.సూర్యనారాయణమూర్తి వలంటీర్లకు ఆర్కిటెక్చర్ ఆఫ్ కాకతీయ మాన్యుమెంట్స్‌పై వివరించారు. అనంతరం చరిత్రకారుడు సత్యనారాయణ హిస్టరీ అండ్ కల్చరల్ ఆఫ్ రామప్ప టెంపుల్‌పై వివరించారు. రామప్ప ఆలయాన్ని సందర్శించిన అమెరికా సైంటిస్ట్ అండ్రీ శిక్షణ శిబిరంలోని వలంటీర్లతో మాట్లాడారు. రామప్ప ఆలయ, చారిత్రాక కట్టడాలపై నేర్చుకుంటున్న శిక్షణ భవిష్యత్‌లో ఎంతగానో ఉపయోగపడుతుందని వలంటీర్లకు సూచించారు. హెరిటేజ్ కట్టడాలను కాపాడడంలో వలంటీర్లు ప్రధాన పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పాండురంగారావు, కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యులు శ్రీధర్‌రావు, శ్రీనివాస్, టూరిజం అసిస్టెంట్ ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్, గైడ్‌లు విజయ్‌కుమార్, వెంకటేశ్ పాల్గొన్నారు.

రామప్ప టెంపుల్ బ్యూటిఫుల్ : అండ్రీ

రామప్ప టెంపుల్ బ్యూటిఫుల్ అని అమెరికాకు చెందిన సైంటిస్టు అండ్రీ కొనియాడారు. రామప్ప దేవాలయాన్ని శనివారం ఆయన సందర్శించి రామలింగేశ్వరున్ని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేయగా టూరిజం అసిస్టెంట్ ప్రమోషన్ ఆఫీసర్ సూర్యకిరణ్ రామప్ప ఆలయ శిల్పాకళాసంపద గురించి వివరించారు. ఈ సందర్భంగా అండ్రీ మాట్లాడారు. నాటి శిల్పుల గొప్పవారని కొనియాడారు. కాకతీయ కట్టడాలైన వరంగల్ కోట, వేయిస్తంభాలగుడిని సైతం సందర్శించినట్లు తెలిపారు. అనంతరం రామప్ప సరస్సును సందర్శించారు.

పీఆర్ సీఈ కార్యాలయ ఏర్పాటుకు సన్నాహాలు

- ఐనవోలు ఎంపీపీ కార్యాలయం పరిశీలన


అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ పి.ప్రావీణ్య

హన్మకొండ : పంచాయతీరాజ్ చీఫ్ ఇంజనీర్ కార్యాలయ ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు హనుమకొండ వడ్డేపల్లి రోడ్డులోని ప్రస్తుత ఐనవోలు మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని పంచాయతీరాజ్ వరంగల్ ఇన్‌చార్జ్ ఎస్‌ఈ శంకరయ్య, వరంగల్ అర్బన్ డిప్యూటీ సీఈఓ రవితో కలిసి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య శనివారం పరిశీలించారు.ఈ నెల 23వ తేదీ వరకు నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. స్థానికంగా మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఉండాలని ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఎంపీపీ కార్యాలయాన్ని ఐనవోలుకు తరలిస్తున్నారు. సోమవారం నుంచి ఐనవోలులో కార్యాలయం పని చేయనుంది. కాగా ఖాళీ అవుతున్న ఎంపీపీ భవనంలోకి పంచాయతీరాజ్ చీఫ్ ఇంజనీర్ కార్యాలయాన్ని తరలించాలనే ఆలోచన అధికారులకు వచ్చింది. రాష్ట్రంలో నాలుగు చీఫ్ ఇంజనీర్ కార్యాలయాలను పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేసింది. ఇందులో హైదరాబాద్‌లో రెండు, నిజామాబాద్, వరంగల్ చీఫ్ ఇంజనీర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. దీంతో హనుమకొండలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో తాత్కాలికంగా సీఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేయగా ప్రస్తుతం అక్కడే కొనసాగుతుంది. అరకొర సౌకర్యాలతో కొనసాగుతున్న ఈ కార్యాలయానికి పూర్తి స్థాయి కార్యాలయం ఏర్పాటు చేయాలని అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.ఈ క్రమంలో ఖాళీ అవుతున్న మండల ప్రజాపరిషత్‌కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. సీఈ కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్‌తో పాటు సూపరిండెంట్ ఇంజనీర్, ఇద్దరు డిప్యూటీ ఈఈలు, ఏడుగురు జూనియర్ ఇంజనీర్లు, ఒక సూపరిండెంట్, ఒక సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ కార్యాలయ పరిధిలో వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, కరీంనగర్, పెద్దపల్లి సర్కిల్‌లు ఉన్నాయి.

'గురితప్పని విలుకాడు' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వేం నరేందర్‌రెడ్డి, తదితరులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి డాక్టర్ సంగని మల్లేశ్వర్ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై రచించిన 'గురితప్పని విలుకాడు' పుస్తకాన్ని శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో అంబేడ్కర్ సచివాలయంలో సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. పుస్తకావిష్కరణలో రామగుండం, చొప్పదండి ఎమ్మెల్యేలు మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, మేడిపెల్లి సత్యం, ఎమ్మెల్సీ దండె విఠల్, పలు జిల్లాల గ్రంథాలయాల సంస్థల చైర్మన్లు పాల్గొన్నారు. కాగా రాజకీయ సామాజిక వ్యాసాల సంకలనాలుగా ఈపుస్తకాన్ని రూపొందించినట్లు డాక్టర్ సంగని మల్లేశ్వర్ తెలిపారు.

నిరుపేద గుండెకు చిల్లు..

- రతన్‌రాజ్‌కు ఓపెన్ హార్ట్ సర్జరీ
- దాతలు కరుణించి 12 ఏళ్ల బాలుడిని రక్షించాలని తల్లిదండ్రుల వేడుకోలు

ధీన గాథ


ఆసుపత్రిలో రతన్ రాజ్

సంగెం: నిరుపేద గుండెకు చిల్లు పడింది. రెక్కడితేనే డొక్కాని నిరుపేద కుటుంబానికి చెందిన బాలుడికి ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాల్సి ఉంది. అయితే వైద్య ఖర్చులకు చేతిలో చిల్లి గవ్వ లేక దాతల సాయం కోసం ఎదురు చూస్తున్న ఓ నిరుపేద కుటుంబం ధీనగాథ ఇది. వరంగల్ జిల్లా సంగెం మండలం తీగరాజుపల్లి గ్రామానికి చెందిన కారింగుల శ్రీలత, రాజు దంపతులకు కూతురు సిరివెన్నెల, కుమారుడు రతన్‌రాజ్(12) ఉన్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఇళ్లు తప్ప ఎలాంటి ఆస్తి లేదు. కూతురు సిరివెన్నెల పర్వతగిరిలోని కేజీబీవీలో తొమ్మిదో తరగతి, కుమారుడు రతన్‌రాజ్ తొర్రూరు ఎంజేపీలో 5వ తరగతి చదువుతున్నాడు. రాజు గోపాలమిత్రగా, శ్రీలత ఆశ కార్యకర్తగా పనిచేస్తూ ఉన్నంతలో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో ఆగస్టులో రాఖీ పౌర్ణమికి ఇంటికి వచ్చిన రతన్‌కు జ్వరం వచ్చింది. దీంతో ఆసుపత్రికెళ్లి చూపించగా తగ్గింది. తిరిగి హాస్టల్‌కు పంపిస్తామనుకునే తరుణంలో గుండెలో నొప్పిగా ఉందని బాలుడు చెప్పాడు. ఆసుపత్రికి తీసుకెళ్లగా గుండెకు చిల్లు పడిందని వైద్యులు తెలిపారు. దీంతో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను కలిస్తే ఎల్‌ఓసీ ఇప్పించగా హైదరాబాద్‌లోని నిమ్స్‌లో స్టంట్ వేయడానికి మూడు సార్లు యత్నించగా వీలు కాలేదు. దీంతో నవంబర్ 4వ తేదీన ఆసుపత్రిలో అడ్మిట్ అయితే రతన్‌కు ఓపెన్ హార్ట్ సర్జరీ చేస్తామని వైద్యులు పేర్కొన్నారు. కాగా, ఇటీవల సిరివెన్నెల కూడా అనారోగ్యానికి గురికాగా సుమారు రూ. 35 వేలు ఖర్చు అయింది. దీంతో ప్రస్తుతం చేతిలో చిల్లి గవ్వలేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రతన్‌కు మందులు, రవాణా ఖర్చులకు సుమారు రూ.2.లక్షలకు పైగా అవసరం అవుతుందని, దాతలు ఆదుకుని తమ కుమారుడి ప్రాణం కాపాడాలని తల్లిదండ్రులు శ్రీలత, రాజు వేడుకుంటున్నారు.

దాతలు: 9494291213- కారింగుల రాజు ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

పిడుగుపాటుకు మహిళ మృతి


మౌనిక మృతదేహం

కేసముద్రం: పిడుగుపాటుకు ఓ మహిళ మృతిచెందింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కోరుకొండపల్లి శివారు మేఘ్యా తండా సమీపంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన లకావత్ మౌనిక(23) పత్తి ఏరుతుండగా సమీపంలో పిడుగుపడింది. దీంతో మౌనిక అక్కడికక్కడే మృతి చెందింది. కొంతదూరంలో ఉన్న అనిత అనే మహిళ స్పృహ తప్పి కింద పడిపోయింది. సంఘటన స్థలం నెక్కొండ మండలం అలంకానిపేట పరిధి కావడంతో కేసముద్రం ఎస్సై మురళీధర్‌తోపాటు నెక్కొండ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి భర్త, కుమారుడు ఉన్నారు.

బోలేరో వాహనం ఢీ.. ఒకరి మృతి


మృతిచెందిన అబ్దుల్ ఖాదర్

నర్సంపేట రూరల్: బోలేరో వాహనం ఢీ కొనడంతో ఒకరు మృతిచెందిన ఘటన నర్సంపేట పట్టణంలోని శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్తాన్ రాష్ట్రంలోని జలూర్ జిల్లా బిన్మిల్ గ్రామానికి చెందిన ఎండీ నసీర్ కుమారుడు అబ్దుల్ ఖాదర్ (21)నర్సంపేట పట్టణం బస్టాండ్ సమీపంలోని ఓ ఫుట్‌వేర్ షాపులో పనిచేస్తున్నాడు. మంచినీళ్ల కోసం వెళ్లి బస్టాండ్ వైపు ఉన్న ఫుట్‌వేర్ షాపునకు వస్తుండగా నర్సంపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్దకు రాగానే వెనుకాల నుంచి బోలేరో వాహనం వచ్చి ఢీ కొట్టడంతోఅబ్దుల్ ఖాదర్ డివైడర్‌కు ఢీకొన్నాడు. దీంతో తలకు తీవ్రగాయమై రక్తస్రావమైంది. వెంటనే స్థానికులు 108లో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల పరీక్షించి మృతిచెందినట్లుగా నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఖాదీర్ ఖాన్ కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

డిప్యుటేషన్ టీచర్ల వివరాలు ఇవ్వాలి

- పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలు

విద్యారణ్యపురి : ఉమ్మడి జిల్లాలోని వరంగల్, హనుమకొండ, ములుగు, జనగామ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా విద్యాశాఖ కార్యాలయాల్లో, మండల రిసోర్స్ సెంటర్లలో (ఎంఆర్సీ) దీర్ఘకాలికంగా డిప్యుటేషన్లపై విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు ఉంటే వారి వివరాలు ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి తాజాగా డీఈఓలకు ఆదేశాలు జారీచేశారు. రాష్ట్రంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయాలు, డీసీఈబీ కేంద్రాలు, ఆర్‌జేడీ కార్యాలయాలు, మండల రిసోర్స్ సెంటర్లలో ఏళ్ల తరబడి డిప్యూటేషన్‌పై కొందరు టీచర్లు విధులు నిర్వర్తిస్తున్నారని వారిని విధుల నుంచి తొలగించాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు లింగారెడ్డి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారని సమాచారం. కాగా పాఠశాల విధులను నిర్వర్తించాల్సిన ఉపాధ్యాయులను డిప్యూటేషన్ల పేర ఇతర పనులు అప్పగించడం సరికాదని, అలాగే ఏళ్ల తరబడి ఒకేచోట డిప్యూటేషన్‌పై కొనసాగించొద్దని ఫిర్యాదు చేశారు. దీర్ఘకాలికంగా వివిధ ప్రధాన కార్యాలయాల్లో పనిచేస్తుంటే అలాంటి ఉపాధ్యాయుల వివరాలను వెంటనే పంపాలని అన్ని జిల్లాల డీఈఓలకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశించారు. దీంతో డీఈఓలు ఆయా టీచర్ల వివరాలను పంపాల్సి ఉంటుంది. తర్వాత పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్న టీచర్లపై ఎలాంటి నిర్ణయంను తీసుకుంటారో వేచి చూడాల్సిందే.